
సాక్షి అనంతపురం

మంగళవారం ၊ 3 ၊ జూన్ ၊ 2025

I



చీనీ టన్ను రూ.30,800

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30,800 పలికాయి.



ఏడాది అరాచకం

కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగిపోయాయి. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులకు అంతే లేకుండా పోయింది.

IIలో

గరిష్టం/కనిష్టం
37.3°/24.5°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి


- కలెక్టర్ వినోద్‌కుమార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

గుత్తి: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న వసుధా ఫంక్షన్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. జేసీ శివ్ నారాయణ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ శ్రీనివాస్, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో ఉన్నతాధికారులకు అందజేశారు. మొత్తం 490 అర్జీలు అందాయి. తనకు బదిలీల్లో తీవ్ర అన్యాయం జరిగిందని అనంతపురం గిరిజన బాలుర కళాశాల హాస్టల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న అనసూయ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అవినీతికి పాల్పడి అంధురాలైన తనను తాను కోరిన గుత్తి ఎస్టీ హాస్టల్‌కు బదిలీ చేయలేదని విన్నవించారు. డబ్బు ముట్టజెప్పిన వారిని కోరిన ప్రాంతానికి బదిలీ చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తదితరులున్నారు.

టీబీ డ్యాంకు 20,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం నాటికి 20,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో మొదలైంది. మే మొదటి వారంలో జీరోగా ఉన్న ఇన్‌ఫ్లో.. నేడు 20,025 క్యూసెక్కులుగా నమోదవుతుండటం గమనార్హం. అవుట్ ఫ్లో 236 క్యూసెక్కులుగా ఉంది. ప్రసుత్తం జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,597.84 అడుగులకు నీరు చేరింది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 18.860 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,577.47 అడుగుల వద్ద 3.360 టీఎంసీల నీటి నిల్వతో 411 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండింది.

బెంగ తీర్చేనా..?!

అనంతపురం సెంట్రల్: జిల్లాకు వర ప్రదాయినిగా పేరుగాంచిన తుంగభద్ర జలాశయం ఈ ఏడాది ముందుగానే జలకళ సంతరించుకుంటుండడంపై రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి త్వరగానే ఆయకట్టుకు సాగునీరు విడుదలవుతాయనే ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా జూన్ నెలాఖరు, జూలైలో డ్యాంకు ఇన్‌ఫ్లో ప్రారంభమవుతుంది. అయితే, ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా పలకరించడంతో కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వారం రోజుల వ్యవధిలోనే 20 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో చేరుకోవడం గమనార్హం. కర్ణాటకలో వర్షాలు కొనసాగితే కొన్ని రోజుల్లోనే గరిష్ట మట్టానికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీబీ డ్యాం పరిధిలో హెచ్చెల్సీ కింద జిల్లాకు చాలా లబ్ధి కలుగుతోంది. దాదాపు లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. ఇలాంటి తరుణంలో డ్యాం త్వరగా నిండితే సాగు,తాగునీటికి ఇబ్బందులు ఉండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై హెచ్చెల్సీ ఎస్‌ఈ పురార్ధనరెడ్డి మాట్లాడుతూ టీబీ డ్యాంకు జూన్‌లోనే ఇన్‌ఫ్లో వస్తుండటం శుభ పరిణామమన్నారు. కేటాయింపులు త్వరగా నిర్ణయించే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాము కాటుతో రైతు మృతి



మృతుడు రామాంజనేయులు

రాయదుర్గం టౌన్: మండలంలోని కెంచానపల్లికి చెందిన రైతు బోయ రామాంజనేయులు (70) పాము కాటుతో మృతి చెందాడు. తన వేరుశనగ పొలంలో సోమవారం మధ్యాహ్నం పనుల్లో నిమగ్నమైన సమయంలో పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. రామాంజనేయులుకు భార్య శివమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

ఏడాది చంద్రబాబు జమానాలో 'అనంత' అన్నదాత అడుగడుగునా దగా పడ్డాడు. అలవిగాని హామీలతో ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసానికి రైతన్న బలయ్యాడు. ఏడాది పాలనలో రైతుకు మేలు చేసే కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి కూడా చేయకుండా చేతులెత్తేయడంతో కరువు రైతు కుదేలయ్యాడు.



అన్నదాతకు అడుగడుగునా దగా

- రైతులకు కూటమి సర్కారు కుచ్చుటోపీ
- చిన్నచూపు ధోరణి ప్రదర్శిస్తున్న సీఎం చంద్రబాబు
- ఒక్క రూపాయి కూడా సాయం చేయని వైనం
- మోసంపై మండిపడుతున్న అన్నదాతలు

అనంతపురం అగ్రికల్చర్: 'అన్నదాత సుఖీభవ' కింద ఏడాదికి రూ.20 వేల చొప్పున రైతుకు పెట్టుబడి సాయం అందిస్తామని గొప్పగా చెప్పిన చంద్రబాబు.. తీరా అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారు. ఇదిగో అదిగో అంటూనే ఏడాది కాలం ముగించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో రూ.6 వేలు రైతుల ఖాతాల్లోకి వేసింది. కానీ చంద్రబాబు తన హామీని గాలికి వదిలేశారు. ఏడాదికి రూ.20 వేలు ఇచ్చివుంటే 2.90 లక్షల మంది వరకు రైతులకు రూ.580 కోట్లు జమ అయ్యేవి. పోనీ... పీఎం కిసాన్ రూ.6 వేలు పోను మిగిలిన రూ.14 వేలు ఇచ్చి ఉన్నా రూ.400 కోట్లకు పైగా సాయం అందేది. కానీ రూపాయి కూడా ఇవ్వకుండా రైతులకు కుచ్చుటోపీ పెట్టేశారు.

- 2019–24 మధ్య వైఎస్ జగన్ సర్కారు ఏటా పీఎం కిసాన్, రైతు భరోసా కింద రూ.13,500 ప్రకారం ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ. 67,500 ఇచ్చింది. మొత్తంగా రైతులకు రూ.1,937 కోట్ల పెట్టుబడి సాయం అందించింది.

పంటల బీమాకు పాడె..

రైతులకు ఎంతగానో మేలు చేస్తున్న ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కారు పాడె కట్టేసింది. ప్రీమియం రూపంలో ఏటా రూ.100 కోట్లకు పైగా రైతుల నుంచి పిండేస్తోంది. 2023 ఖరీఫ్, రబీకి సంబంధించి ఉచిత పంటల బీమా పథకం కింద పెద్ద మొత్తంలో పరిహారం ఇవ్వాల్సివుండగా... తమకు సంబంధం లేదన్నట్లుగా చంద్రబాబు ఎగనామం పెట్టేశారు. 2024 ఖరీఫ్‌లో కూడా ఉచిత పంటల బీమా అమలు చేసినా... పరిహారంపై నోరు మెదపడం లేదు.

- 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులపై పైసా కూడా ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా కింద ఏకంగా జిల్లా రైతులకు రూ.1,967 కోట్ల భారీ మొత్తంలో పరిహారం ఇచ్చింది. తొలిసారిగా ఉద్యాన రైతులకు బీమా ఇచ్చి భరోసా కల్పించారు. ఇక ప్రీమియం రూపంలో ఏటా రూ.100 కోట్ల వరకు జిల్లా రైతులకు ఆదా అయ్యేలా చేశారు.

బాధిత కుటుంబాలపై నిర్లక్ష్యం..

చంద్రబాబు ఏడాది పాలనలో పంటలు పండక, అప్పుల బాధతో 45 మంది వరకు రైతులు ఆత్మహత్య చేసుకున్నా... ప్రభుత్వం చలించడం లేదు. రూ.7 లక్షలు అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది.

- ఆత్మహత్య బాధిత కుటుంబాలకు గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో రెండు మూడు నెలల్లోపే రూ.7 లక్షల మేర పరిహారం ఇచ్చి అండగా నిలిచారు. అలా 280 బాధిత రైతు కుటుంబాలకు రూ.17.40 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించారు. గతంలో చంద్రబాబు పాలించిన 2014–19 మధ్య కాలంలో ఆత్మహత్య చేసుకున్న రైతులకు సంబంధించి 110 కుటుంబాలు ఈ జాబితాలో ఉండటం గమనార్హం.

సున్నా వడ్డీ, పావలా వడ్డీ లేదు..

ఖరీఫ్, రబీలో పంట పెట్టుబడుల కోసం బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుని ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు పావలావడ్డీ ఇవ్వలేదు. రూ.లక్ష లోపు రుణం తీసుకున్న సన్నచిన్నకారు రైతులకు వడ్డీ రాయితీలు కూడా ఇవ్వకుండా దాటవేస్తున్నారు.

- గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీ కింద రూ.72 కోట్ల వరకు వడ్డీ మాఫీ చేయడంతో 3.40 లక్షల మంది సన్న చిన్నకారు రైతులకు ప్రయోజనం కలిగింది.

గిట్టుబాటు లేక నష్టాలు..

అరకొరగా చేతికొచ్చిన పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారు. చీనీ, అరటి రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్నా... ప్రభుత్వం ఉపశమన చర్యలు చేపట్టలేదు. పత్తి, కంది రైతులు కూడా బాగా నష్టపోయారు. అరకొర కొనుగోలు కేంద్రాలతో మమ అనిపించేశారు.

- గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులు పండించిన రూ.350 కోట్లు విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తులు మద్దతు ధరతో కొనుగోలు చేసి మేలు చేకూర్చింది.

అతీగతీ లేదు..



2023 రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధానపంట పప్పుశనగతో పాటు మిగతా పంటలు దెబ్బతిన్నాయి. అప్పటి ప్రభుత్వం 17 మండలాలను కరువు జాబితాలో ప్రకటించింది. కేంద్ర కరువు బృందం కూడా చంద్రబాబు ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ఆగస్టులో వచ్చివెళ్లింది. కానీ, ఇప్పటికీ రూ.36 కోట్ల పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఊసే ఎత్తడం లేదు. 2024 ఖరీఫ్‌లో కరువు జాబితాలో కేవలం ఏడు మండలాలనే ప్రకటించి... కేంద్ర బృందాన్ని రప్పించి రూ.19 కోట్లు ఇన్‌పుట్ ఇస్తామన్నారు. దానికీ మోక్షం లేదు. ఈ రబీలో కూడా కేవలం ఏడు మండలాలను కరువు జాబితాలోకి చేర్చి చేతులు దులుపుకున్నారు. ఇక అకాల వర్షాలు, వడగళ్ల వాన, ఈదురుగాలులు లాంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.45 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇలా 'ఇన్‌పుట్' కింద రూ.101 కోట్ల మేర పెండింగ్ పెట్టారు.

- గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ పరిహారం ఇచ్చి ఆదుకుంది. అలా గత ఐదేళ్ల కాలంలో జిల్లా రైతులకు రూ.377 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశారు.

రాయితీ విత్తనాలకు కత్తెర..



రాయితీపై ఇచ్చే విత్తనాలకు కూడా కత్తెర వేశారు. అలాగే రాయితీ కూడా కుదించి రైతులపై భారం మోపారు. ఈ రబీలో కేవలం 25 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందించడంతో జిల్లా రైతులపై రూ.6 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఇక ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, కందులు నామమాత్రంగా అందించారు. 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయం అంటూ 27 వేల క్వింటాళ్లకు గానూ 10 వేల క్వింటాళ్లతో సరిపెట్టారు. ఈ ఖరీఫ్‌లో కేవలం 50 వేల క్వింటాళ్లు మాత్రమే విత్తన ప్రణాళిక తయారు చేశారు.

- వైఎస్ జగన్ ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తనం అందించింది. ఐదేళ్లలో అన్ని రకాలకు చెందిన 6.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలపై రూ.289 కోట్లు రాయితీ కల్పించడం గమనార్హం.

రైతు సంక్షేమం పట్టదా?



ఇటీవల వర్షాలకు 5 ఎకరాల్లో వేరుశనగ, వరి పంట దెబ్బతింది. ఇంత వరకూ పరిహారం ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేవారు. ప్రస్తుతం అధికారులు నివేదికలు పంపిస్తున్నారే గానీ సాయం మాత్రం చేయడం లేదు. రైతు సంక్షేమం గురించి ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు.
– శివారెడ్డి, దయ్యాలకుంటపల్లి, బుక్కరాయసముద్రం మండలం

నట్టేట ముంచారు



తాను అబద్ధాల కోరు అని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు. గత ఏడాది 25 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పత్తికి గిట్టుబాటు ధర లభించలేదు. దీంతో రూ. 4 లక్షల నష్టం వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేద్దామంటే చేతిలో డబ్బు లేదు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందనుకుంటే.. అదిగో...ఇదిగో... అంటూనే కాలయాపన చేస్తోంది.
– ఎన్.హరినాథ్‌రెడ్డి, నీలూరు గ్రామం, పామిడి మండలం

చేతిలో చిల్లిగవ్వ లేదు



మూడెకరాల పొలంలో గతేడాది కంది, ఆముదం పంటలు సాగు చేశా. తుపానుల కారణంగా పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. దాదాపు రూ.60 వేల వరకూ ఖర్చయింది. దీంతో దిగుబడి మాట అటుంచితే కనీసం పెట్టుబడి డబ్బు కూడా అందక అప్పుల్లో కూరుకుపోయా. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో పంటలు ఎలా సాగు చేయాలో దిక్కుతోచడం లేదు.
– రైతు ఓబుళప్ప, వైటీ చెరువు, గుంతకల్లు మండలం

ఎదురుచూస్తున్నాం



నాడు వైఎస్ జగన్ రైతులకు చెప్పిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే రైతులకు రైతు భరోసా పథకం ద్వారా భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందే కానీ ఇంత వరకు అమలు చేయలేదు. నేడు ఆర్థిక సాయం కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితులు వచ్చాయి.
– దేవేంద్ర యాదవ్, పుప్పాల గ్రామం, యాడికి మండలం

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అదుర్స్

- ఆలిండియా ఓపెన్ కేటగిరీలో భూపతి నితిన్ అగ్నిహోత్రికి 183వ ర్యాంకు


భూపతి నితిన్ అగ్నిహోత్రి


విశాల్


భావన


మహమ్మద్ ఆసిఫ్


మోక్షసాయి రెడ్డి


సవిత్‌కుమార్ రావు


శెట్టిపల్లి శశిధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్/శింగనమల: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'అనంత' విద్యార్థులు అదుర్స్ అనిపించారు. పలువురు జాతీయస్థాయి ర్యాంకులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ పరీక్షలు 12.68 లక్షల మంది విద్యార్థులు రాశారు. 2.5 లక్షల మంది విద్యార్థులు అర్హత సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో 17 వేల సీట్లు, తక్కిన సీట్లు ఎన్ఐటీ, ఐఐఐటీ, కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విడుదలైన ఫలితాల్లో భూపతి నితిన్ అగ్నిహోత్రి 360 మార్కులకు గాను 264 మార్కులు సాధించి అఖిల భారత స్థాయి ఓపెన్ కేటగిరీలో 183 ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. అలాగే శింగనమల మండలం సీ.బండమీదపల్లి గ్రామానికి చెందిన శెట్టి పల్లి శశిధర్‌రెడ్డి 638, అనంతపురం నగరానికి చెందిన పి. విశాల్ 3,946, భావన 10,889, మోక్ష సాయి రెడ్డి 12,809, ఆసిఫ్ 16,099, సవిత్ కుమార్ రావు 16,884 ర్యాంకు, డి.లోకేష్ కుమార్ 114 (ఎస్సీ కేటగిరీ) ర్యాంకు, ప్రణయ్ చౌదరి 5,499 (ఈడబ్ల్యూఎస్) ర్యాంకు సాధించారు. వీరందరికీ నేరుగా ఐఐటీలో ఇంజినీరింగ్ సీట్లు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.





అనంతపురంలోని మారుతీనగర్‌లో రేషన్ షాపు వద్ద నిల్చునే ఓపిక లేక కూర్చుండిపోయిన లబ్ధిదారులు (ఇన్‌సెట్‌లో) ఇబ్బందులు పడుతూ బియ్యం సంచి మోసుకెళ్తున్న మహిళ

జనం నెత్తిన 'రేషన్ బరువు'

ఇంటి వద్దకు వాహనం వచ్చినప్పుడు రేషన్ తీసుకుంటూ వచ్చిన కార్డుదారులకు... ఇప్పుడు 'నెత్తిన రేషన్ బరువు' మోయాల్సిన దుస్థితి పట్టింది. ఇంటింటికీ రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం పాడి... చౌక దుకాణాల ద్వారానే అందజేసే విధానం తేవడంతో కార్డుదారులకు కష్టాలు మొదలయ్యాయి. ఇక 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందిస్తామంటూ కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రగల్భాలు పలికినా.. క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. దీంతో వృద్ధులు స్టోర్ల వద్దకు వచ్చి బియ్యం, సరుకులు తీసుకుంటున్నారు. రేషన్ పంపిణీ మొదలైన రెండో రోజు సోమవారం కూడా జిల్లావ్యాప్తంగా కార్డుదారులు అవస్థలు పడ్డారు.
– అనంతపురం అర్బన్/సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మోసం... చంద్రబాబు నైజం



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ మంత్రి శైలజానాథ్ తదితరులు

- వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని విజయవంతం చేద్దాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం: ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ సూపర్ సిక్స్ వాగ్దానాల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు మోసగించారన్నారు. హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కేసులు, హత్యాకాండకు పాల్పడుతున్నారన్నారు. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అరాచక పాలన సాగించడం హేయమన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ హామీల అమలుపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడానికి 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 4న నార్పల మండలంలో ఆందోళన, నిరసన కార్యక్రమం ఉంటుందని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, అనుబంధ సంఘాల పరిశీలకులు సురేంద్ర మాట్లాడుతూ కూటమి పాలన రాష్ట్రంలో ఎల్లకాలం ఉండదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడరాదని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరేష్, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నాగలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, పూల నారాయణస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరెడ్డి, చికెన్ నారాయణస్వామి, సాకే నారాయణస్వామి, అనంత వెంకటరెడ్డి, కాటమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

15 వరకూ రేషన్ పంపిణీ : జేసీ

అనంతపురం అర్బన్: చౌక ధరల దుకాణాల్లో ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన రేషన్ పంపిణీ 15వ వరకు కొనసాగుతుందని జేసీ శివ్ నారాయణ్ శర్మ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను సోమవారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. 15వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేస్తారన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5 వరకూ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారి ఇంటి వద్దకే డీలర్లు వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు తన ఆదేశాలను అమలు చేసి రేషన్ సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏడాది అరాచకం

చంద్రబాబు పాలనలో జిల్లాలో అరాచకం కొనసాగుతోంది. లోకేష్ ఫొటోలతో కూడిన రెడ్‌బుక్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా మారణహోమంతో బీభత్సం సృష్టించడమే అజెండా అని అధికారికంగా ప్రకటించడం టీడీపీ కూటమికే చెల్లింది. తద్వారా టీడీపీ గూండాలు కర్రలు, రాళ్లతో యథేచ్ఛగా దాడులు చేయాలని సంకేతాలు ఇచ్చింది. ఇందుకు పోలీసులు సహకరించాలి లేదా పక్కకు తప్పుకోవాలని స్పష్టం చేసింది. ప్రభుత్వమే అధికారికంగా గూండాగిరికి తెగిస్తే ఎంతటి విధ్వంసం సాగుతుందో ఈ ఏడాదిలో ప్రజలు ప్రత్యక్షంగా చూశారు.


రాప్తాడు మండలంలో టీడీపీ నాయకులు నిప్పు పెట్టడంతో కాలిపోయిన బోరు, డ్రిప్ పరికరాలు (ఫైల్)


రాప్తాడు మండలం వరిమడుగులో స్థలం కబ్జా కోసం టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన బండలు (ఫైల్)

- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అంతులేని ఆకృత్యాలు, దౌర్జన్యకాండ
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల విధ్వంసం
- అక్రమ కేసులు, అరెస్ట్‌లు, హత్యలు
- రెడ్‌బుక్ రాజ్యాంగానికి దాసోహమన్న పోలీసులు

అనంతపురం: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజా ప్రతినిధుల నుంచి సామాన్యుల వరకూ ఎవరికీ రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసకాండ కొనసాగుతోంది. ఇక ప్రైవేట్ ఆస్తుల విధ్వంసానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పచ్చ మూకలు రెచ్చిపోయి ఆస్తుల విధ్వంసానికి తెరతీస్తున్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, తాగునీటి ట్యాంకులు వంటి ప్రభుత్వ ఆస్తులను కూలగొట్టారు. టీడీపీ అధికార మదానికి పోలీసు శాఖ దాసోహమైంది. ప్రభుత్వ ప్రేరేపిత దాడులు కావడంతో చేష్టలుడిగి చూస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలాయి.

ఆగని దౌర్జన్యకాండ

- సార్వత్రిక ఎన్నికల అనంతరం తాడిపత్రి పట్టణంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు ఫయాజ్ బాషా నూతనంగా గృహాన్ని నిర్మించారు. ఇందుకు సంబంధించి అన్ని అంశాలు సక్రమంగా ఉన్నాయి. మున్సిపాలిటీ అనుమతులూ ఉన్నాయి. అయినా... ఫయాజ్‌బాషా నిర్మించిన ఇంటిని ఆక్రమణల పేరుతో తొలగించేందుకు మునిసిపల్ అధికారులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పురమాయించారు. ఇంటిని కూల్చాలని ఒత్తిడి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అధికారుల చర్యలను పలు దఫాలుగా ఫయాజ్ బాషా అడ్డుకున్నారు. దీంతో నేరుగా జేసీ ప్రభాకర్‌రెడ్డి రంగంలో దిగి జేసీబీని తీసుకెళ్లి ఫయాజ్‌బాషా ఇంటిపైకి టీడీపీ కార్యకర్తలతో రాళ్ల దాడి చేయించారు. అనంతరం టీడీపీ కార్యకర్తలపై ఫయాజ్‌బాషానే రాళ్ల దాడికి పాల్పడ్డారంటూ రివర్స్ కేసు నమోదు చేయించారు.


రాప్తాడులో టీడీపీ మూకల దాడిలో హత్యకు గురైన చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులు (ఫైల్)

- సార్వత్రిక ఎన్నికలు పూర్తయినప్పటి నుంచి ఇప్పటి వరకూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనివ్వకుండా రెడ్‌బుక్ రాజ్యాంగంతో అడ్డుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన గొడవల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డిని, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇరువురినీ తాడిపత్రి వదిలి వెళ్లాలని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యాక జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒక్కరే తాడిపత్రిలో కాలు పెట్టారు. కానీ కేతిరెడ్డి పెద్దారెడ్డిని మాత్రం పోలీసులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో తాడిపత్రికి వెళ్లడానికి హైకోర్టు నుంచి అనుమతులు తీసుకున్నా పెద్దారెడ్డిని ఇప్పటికీ అక్కడ కాలు పెట్టనివ్వడం లేదు. హైకోర్టు ఆదేశాలను సైతం ఎస్పీ పట్టించుకోలేదంటే రెడ్ బుక్ రాజ్యాంగానికి పోలీస్ వ్యవస్థ ఎంతలా దాసోహమైందో అర్థం చేసుకోవచ్చు.
- జిల్లా వ్యాప్తంగా ఖాళీ స్థలాలనే కాకుండా పట్టా స్థలాలనూ టీడీపీ నేతలు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. అడ్డుకోబోయిన సొంత దారులపై దాడులకు తెగబడుతున్నారు.

కుంటి సాకులతో కేసులు

- జిల్లాలో ఇప్పటి వరకూ 70 మందికి పైగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. రివర్స్ కేసులతో వేధింపులకు గురిచేశారు.
- చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కళ్యాణదుర్గంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నాయకుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామితో పాటు మొత్తం 48 మంది నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసేందుకు ర్యాలీగా వెళ్తుండగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కానిస్టేబుల్ లింగరాజును ప్రభావితం చేసి, ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు తప్పుడు కేసు నమోదు చేయడం గమనార్హం.
- చిన్నారిపై జరిగిన అఘాయిత్యాన్ని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఖండించి, నిందితులను శిక్షించాలని ప్రెస్‌మీట్‌లో కోరినందుకు కేసు నమోదు చేసి, వేధింపులకు గురి చేశారు.
- ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై దాడికి యత్నించారంటూ ఎంపీ గోరంట్లమాధవ్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు.
- విద్యుత్ బిల్లుల పెంపు అంశంపై నిరసన తెలిపేందుకు సిద్ధమైన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిపై ఉరవకొండలో ట్రాఫిక్‌కు అంతరాయంకలిగించారనే నెపంతో అక్రమ కేసు నమోదు చేశారు.
- గుమ్మఘట్ట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొని కాంతారెడ్డి.. ఓ యాక్సిడెంట్ కేసు విషయంలో పంచాయితీ చేసి బాధితులకు అందాల్సిన రూ.నాలుగు లక్షలను వాడుకున్నాడని తప్పుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేయించి రిమాండ్‌కు పంపారు.
- ఆత్మకూరు, రాయదుర్గం మండలం ఆయతపల్లి, బెళుగుప్ప గ్రామాల్లోని సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమంగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.
- డి.హీరేహాళ్ మండలంసిద్ధాపురం తండాలో తాగునీటి కొళాయి విషయంగా ఘర్షణ పడి ఏడుగురు వైఎస్సార్‌సీపీ నాయకులపైనే రివర్స్ కేసు నమోదు చేయించి రిమాండ్‌కు పంపారు.
- డి.హీరేహాళ్ మండలం కళ్లెం గ్రామంలో చోటు చేసుకున్న చిన్న పాటి ఘర్షణకు రాజకీయ రంగు పులిమి 11 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు బనాయించి రిమాండ్‌కు పంపారు.

చిన్నారులనే కనికరం లేకుండా

- రాయదుర్గం మండలం యర్రగుంట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముక్కన్న లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మనో వేదనకు గురైన ఆ బాలిక హెచ్చెల్సీలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. అప్రమత్తమైన స్థానికులు బాలికను కాపాడారు. ముక్కన్నకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.
- గత నెలలో కేవలం రోజుల వ్యవధిలోనే 15 మంది మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారు. కారణాలు ఏమైనా ఇప్పటి వరకూ కొన్ని అదృశ్యం కేసుల్లో మిస్టరీ వీడలేదు.

రాక్షసత్వానికి పరాకాష్ట

- పుట్లూరు మండలం కోమటిగుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్, విశ్వనాథ్, శేఖర్ తదితరులపై టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అదే సమయంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరికలయ్య(55) టీడీపీ నాయకుల్ని అడ్డుకుని నిలువరించే ప్రయత్నం చేయడంతో ఆయనపై బండరాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. బలమైన గాయాలతో అక్కడే కుప్పకూలి ఎరికలయ్య మృతి చెందాడు.
- రాప్తాడులో వైఎస్సార్‌సీపీకి చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతుల హత్య రాష్ట్రాన్నే కుదిపేసింది. పొలం తగాదా విషయంలో ఇనుపరాడ్లు, కట్టెలు, వేట కొడవళ్లతో దాడి చేయడంతో ఘటనాస్థలంలోనే భార్య, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో భర్త మృతి చెందారు. రాప్తాడు సమీపంలోని గంగలకుంటకు చెందిన పొలం విషయంగా దాయాదుల మధ్య నెలకొన్న వివాదంలో టీడీపీ నేతలు తలదూర్చి ఈ ఘాతుకానికి తెగబడ్డారు.


రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామ సచివాలయం అద్దాలను పగులగొట్టిన దృశ్యం (ఫైల్)

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ గూండాల దాడి


చికిత్స పొందుతున్న మారుతి

యాడికి: మండలంలో టీడీపీ గూండాలు బరితెగించి బోయరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మారుతిపై దాడికి పాల్పడ్డారు. సోమవారం మధ్యాహ్నం బోయరెడ్డిపల్లి నుంచి తన ద్విచక్ర వాహనంపై పెన్నా సిమెంటుకు బయలు దేరిన మారుతిని పరిశ్రమ సమీపంలో ఉన్న వంక వద్ద అదే గ్రామానికి చెందిన టీడీపీ గూండాలు అడ్డుకుని కట్టెలు, పైపులతో దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మారుతి ప్రస్తుతం అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగాతి బ్రహ్మానందారెడ్డి, మల్లికార్జున, రామకృష్ణ తదితరులు అనంతపురంలోని ఆస్పత్రికి చేరుకుని మారుతిని పరామర్శించారు.

చాగల్లు రిజర్వాయర్‌లో అమ్మవారి విగ్రహం లభ్యం



పెద్దపప్పూరు: చాగల్లు రిజర్వాయర్‌లో అమ్మవారి పంచలోహ విగ్రహం లభ్యమైంది. పెద్దయక్కలూరు గ్రామానికి చెందిన కొందరు జాలర్లు ఆదివారం రాత్రి చేపల వేట కోసం చాగల్లు రిజర్వాయర్ దిగువ ప్రాంతంలో వలలు వేయగా 3 అడుగుల ఎత్తు దాదాపు 30 కిలోల బరువు ఉన్న పంచలోహపు అమ్మవారి విగ్రహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పెద్దపప్పూరు గ్రామస్తులు అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో ఘనంగా ఊరేగించి చౌడేశ్వరిదేవి ఆలయంలో ఉంచారు.

కర్ణాటక వాసి దుర్మరణం


మహమ్మద్ (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రాయచూర్ నుంచి పేపర్ బెడ్స్ లోడ్‌తో వచ్చిన ఐచర్ వాహనం అనంతపురంలో అన్‌లోడ్ చేసి సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమైంది. కాశేపల్లి టోల్‌ప్లాజా దాటగానే డ్రైవర్ ఖలీల్ నిద్ర మత్తులో జోగడంతో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో రాయచూరు జిల్లా మాన్వికి చెందిన ఐచర్ క్లీనర్ మహమ్మద్ (31) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు యూనస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మార్కెట్ వసూళ్లు ఆశాజనకం

అనంతపురం అగ్రికల్చర్: మార్కెట్‌యార్డు పరిధిలో వివిధ రకాల ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు ఆ శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. జిల్లాలోని9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.13.49 కోట్లు వసూళ్ల లక్ష్యంగా పెట్టుకోగా మొదటి రెండు నెలల కాలంలో 18 శాతంతో రూ.2.42 కోట్లకు పైగా సాధించినట్లు వివరించారు. అందులో మే నెల టార్గెట్ రూ.1.01 కోట్లు కాగా రూ.1.03 కోట్లు వసూలైందన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన కూడేరు వాసులు


ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

కూడేరు: మంత్రి పయ్యావుల కేశవ్ సొంత ఇలాకాలో తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తమకు తాగునీరు అందడం లేదంటూ సోమవారం కూడేరు వాసులు ధర్నా చేపట్టారు. మండల కేంద్రంలోని బోయ, కమ్మ, దళిత, కటిక వీధులు, శ్రీసత్యసాయి కాలనీల్లో పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా కాలనీ వాసులు సోమవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణమూర్తి మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న సీఐ రాజు అక్కడికు ఆందోళన కారులతో చర్చించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ అధికారులతో మాట్లాడుకోవాలని సూచించారు. అయితే అధికారులే వచ్చి నీటి సమస్య తీరుస్తామని హామీ ఇచ్చేంత వరకూ అక్కడి నుంచి కదిలేది లేదని మహిళలు తేల్చి చెప్పారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి అక్కడకు చేరుకుని వారం రోజుల్లోపు కొత్తగా బోర్లు వేయించి, నీరు సరఫరా అయ్యేలా చేస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

కరోనా టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలి

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు/ఉరవకొండ: జిల్లాలోని ఆస్పత్రుల్లో కరోనా టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రులోనూ కరోనా టెస్టింగ్ కిట్లు అందుబాటులో లేవన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోనే ఇలాంటి దుస్థితి ఉంటే ఇక రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చున్నారు.

అనంతలో మళ్లీ ఎడారి ఛాయలు

- అనంతపురం, కర్నూలు జిల్లాలకు 63 టీఎంసీల నీరు ఇవ్వాల్సిందే
- లైనింగ్ పనులతో రైతులకు నష్టం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


పంపనూరు వద్ద హంద్రీ-నీవా లైనింగ్ పనులను పరిశీలిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: సీఎం చంద్రబాబు తీరుతో జిల్లాలో మళ్లీ ఎడారి ఛాయలు అలుముకుంటున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీ-నీవా కాలువలో లైనింగ్ పనులను రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన పరిశీలించి, మాట్లాడారు. హంద్రీ నీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే మహోన్నత లక్ష్యంతో దివంగత నేత వైఎస్సార్ హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను చేపట్టారని గుర్తు చేశారు. 2015లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 6 లక్షల ఎకరాలను రద్దు చేస్తూ జీఓ 22 ఇచ్చారన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెరువులతో పాటు 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో 63 టీఎంసీల ప్రవాహ సామర్థ్యంతో శ్రీశైలం డ్యాం మల్యాల నుంచి కాలువను వెడల్పు చేసేలా జీఓ ఇచ్చి, పనులు మొదలు పెట్టారన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు 3 టీఎంసీలు ఇచ్చి కర్నూలు ప్రజల దాహార్తిని తీర్చాలని, డోన్ ప్రాంతంలో 63 చెరువులకు2 టీఎంసీలు, శింగనమల, శింగనమల రూరల్ చెరువులకు 2.3 టీఎంసీలు కేటాయిస్తూ జీఓ ఇచ్చారన్నారు. అలాగే జీడిపల్లి నుంచి 3.7 టీఎంసీలు భైరవానితిప్ప ప్రాజెక్ట్‌కు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని చెరువులకు సంబంధించి 114 చెరువులకు నీరు ఇచ్చేలా కార్యాచరణను రూపొందించారన్నారు. పేరూరు డ్యాంకు జీడిపల్లి నుంచి నీళ్లు ఇస్తూ సోమరాండ్లపల్లి, పుట్టకనుమ, తోపుదుర్తి, ముట్టాల చెరువులకూ 4.3 టీఎంసీలు కేటాయించారన్నారు. పుట్టపర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 193 చెరువులకు, కియో ఫ్యాక్టరీకి నీరు ఇచ్చే బృహత్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌లన్నీ రద్దు చేస్తూ నిధుల దుర్వినియోగానికి తెరలేపిందన్నారు. గతంలో అమిలినేని సురేంద్రబాబు కాలువ మీద 20 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అమ్ముకున్నారన్నారు. ప్యాకేజ్ 2లో రూ.9 కోట్ల పనులను రూ.95 కోట్లకు బిల్లులు చేసుకున్నారని తెలిపారు. ప్యాకేజీ 3లో రూ.40 కోట్ల పనులకు సంబంధించి రూ.105 కోట్ల బిల్లులు చేసుకున్నారని వివరించారు. హంద్రీ నీవా కాలువ లైనింగ్‌పనులతో రైతులకు తీరని నష్టమన్నారు. కాలువను 63 టీఎంసీలతో అనంతపురం, కర్నూలు జిల్లాలకు పరిమితం చేయాలని, జగనన్న తీసుకొచ్చిన ప్రాజెక్టులను పూర్తి చేసి చిత్తూరు, కడప జిల్లాలకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిల్ల కాలువల నిర్మాణం చేపట్టి 6 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చే ఏర్పాటు చేసిన తరువాతనే లైనింగ్ పనులు చేసుకోవాలన్నారు. గండికోట నుంచి గాలేరు నగరికి అక్కడి నుంచి చిత్తూరు జిల్లాలో హంద్రీ నీవా పుంగనూరు బ్రాంచ్‌కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ కొనసాగించాలని దీనిని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించాలన్నా, పాదయాత్రలు చేయాలన్నా, సభలు పెట్టాలన్నా అధికారులు అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు అనుమతులు ఇచ్చినా ఇవ్వకపోయినా ఈ నెల 9న తోపుదుర్తి గ్రామంలో తన నివాసం వద్దనే వేల మంది రైతులతో నిరాహార దీక్ష చేపడుతానని ప్రకటించారు.

పార్టీ పటిష్టతలో అనుబంధ సంఘాలు కీలకం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ అనుబంధ సంఘాల నాయకులు

అనంతపురం కార్పొరేషన్: పార్టీ పటిష్టతలో అనుబంధ సంఘాల పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ హరిప్రసాదరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.సురేంద్రరెడ్డి అన్నారు. ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అనుబంధ విభాగాల అధ్యక్షులతో సోమవారం వారు సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పార్టీను బలోపేతం చేయడానికి పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న వారికి వివిధ పదవులతో జగనన్న గుర్తింపునిచ్చారన్నారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలతో మమేకమై పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనేలా చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలన్నారు. ప్రజల పక్షాన నిలిచి వైఎస్సార్ సీపీ అధిష్టానం దశలవారీగా పోరాటాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హరిప్రసాదరెడ్డి, సురేంద్ర రెడ్డిని అనుబంధ విభాగాల అధ్యక్షులు సన్మానించారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లింగారెడ్డి, నరేంద్రరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, వైపీ బాబు, మల్లెమీద నరసింహులు, కురుబ దేవేంద్ర, మూడే శ్రీనివాసులు నాయక్, రాజశేఖరరెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, కె శ్రీనివాసరెడ్డి, ఎం ధనుంజయ, సి.నాగప్ప, ఓబిరెడ్డి, ఎంసీ సంధ్యారాణి, శ్రీదేవి, రిలాక్స్ నాగరాజు, వై.నరేంద్రరెడ్డి, సైపుల్లాబేగ్ పాల్గొన్నారు.

గుత్తి కోట ఉత్సవాలకు రూ.50 లక్షలు


గుత్తి కోట ఎక్కుతున్న కలెక్టర్ వినోద్ కుమార్, అధికారులు

గుత్తి: వచ్చే ఏడాది జనవరిలో గుత్తి కోట ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు గాను రూ.50 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం గుత్తి కోటపై నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల హాజరయ్యారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, జిల్లా పర్యాటక అధికారి విజయకుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, కమిషనర్ జబ్బార్ మియా, తహశీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, మహర్షి దయానంద గురుకుల పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న ప్రభుత్వాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు


మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

అనంతపురం అర్బన్: సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ఆర్థిక భారాలను మోపుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. ఆస్తి పన్ను పెంపును వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ప్రభుత్వాల సంస్కరణల వల్ల ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాలపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆదానీకి దాసోహమైందని ఆరోపించారు. ఆదానీకి లబ్ధి చేకూరేలా పెంచిన విద్యుత్ చార్జీలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. సర్దుబాటు పేరుతో రూ.18 వేల కోట్ల భారాన్ని ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లను పగలకొట్టాలంటూ ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే మాట మార్చాయని మండిపడ్డారు. విద్యుత్‌చార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు, ఆస్తిపన్ను పెంపునకు వ్యతిరేకంగా ప్రజలందరినీ కలుపుకుని రానున్న రోజుల్లో పోరాటాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి, సిటిజెన్స్ ఫోరమ్ నాయకులు ఏజీరాజ మోహన్, నాయకులు మత్తుజ, వెంకటనారాయణ, ప్రకాష్, గోపాల్, మసూద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

డ్యాం గేట్ల మార్పు టెండర్ ఖరారు

హొసపేటె: తుంగభద్ర డ్యాం 32 క్రస్ట్‌గేట్లను మార్చే బాధ్యతలను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ ప్రాజెక్ట్ కంపెనీకి అప్పగించారు. ఈ పనిని పూర్తి చేయడానికి ఆ సంస్థకు 15 నెలల గడువుతో తుంగభద్ర బోర్డు బాధ్యతను అప్పగించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన కంపెనీకి ఇప్పటికే రిజర్వాయర్‌లోని 19వ గేట్ కోసం క్రస్ట్‌గేట్ నిర్మించే బాధ్యతను అప్పగించగా ఈ పనిని ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలి. ఆలోగా 32 గేట్ల పనితో పాటు మొత్తం 33 గేట్ల నిర్మాణ పనులను అదే కంపెనీకి అప్పగించారు. 32 గేట్ల నిర్మాణానికి తుంగభద్ర బోర్డు రూ.52 కోట్ల మొత్తాన్ని నిర్ణయించింది. ఈ టెండర్‌లో కంపెనీ రూ.41.42 కోట్లకు పనిని పూర్తి చేయడానికి బిడ్‌ను సమర్పించింది. తక్కువ బిడ్ కారణంగా నిర్మాణ బాధ్యతను ఆ కంపెనీకి అప్పగించినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



తోపుదుర్తి రామ్మోహన్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



తోపుదుర్తి రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన తోపుదుర్తి రామ్మోహన్‌రెడ్డి (60) సోమవారం గుండెపోటుతో జిల్లా కేంద్రంలో మరణించారు. రామ్మోహన్ రెడ్డి మృతదేహానికి సోమవారం తోపుదుర్తి గ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. రామ్మోహన్‌రెడ్డి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మేయర్ వసీం, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తోపుదుర్తి కవిత, తోపుదుర్తి చంద్రశేఖ ర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామ్మోహన్‌రెడ్డి వైఎస్సార్ కుటుంబానికి సంబంధించి కొన్ని పుస్తకాలు రాశారని.. వాటితో పులివెందులలో ఓ లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నివాళి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి రామ్మోహన్ రెడ్డి సోమవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నగరంలోని ఉన్న వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. తోపుదుర్తి రామ్మోహన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి సహకరించాలి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: రాజకీయాలకు అతీతంగా మసీదులు, మైనార్టీల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు షకీల్‌షఫీ కోరారు. అశోక్ నగర్‌లో నూతనంగా నిర్మించిన మసీదును సోమవారం ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మేయర్ వసీం, జామియా మసీదు ముతవల్లీలు షకీల్‌షఫీ, కేఎం షఫీవుల్లా తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే రంజాన్ నుంచి ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తామని తెలిపారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలో ముస్లింలకు పెద్దపీట వేశారని రానున్న బక్రీదు వేడుకల సందర్భంగా మసీదుల్లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, దాదు, జావీద్ తదితరులు పాల్గొన్నారు. ఇదే సమావేశంలో సీనియర్ రచయిత డాక్టర్ రమేష్ నారాయణ రచించిన 'శ్రీమహమ్మద్ రసూల్ వారి చరిత్ర.. మహాకవి డాక్టర్ ఉమర్ ఆలీషా వారి ప్రసిద్ధ కావ్యం ఒక పరిచయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

టీడీపీ నేతల ఒత్తిడితో బోర్డు తొలగింపు



తొలగించిన బోర్డును పరిశీలిస్తున్న సర్పంచ్ భర్త ఆదినారాయణ

రాప్తాడురూరల్: టీడీపీ చోటా నాయకుల ఒత్తిళ్లతో అనంతపురం రూరల్ మండలం కురుగుంట సర్పంచ్ లక్ష్మీదేవి నిర్వహిస్తున్న టీ కేఫ్‌కు సంబంధించిన బోర్డును ఆర్‌అండ్‌బీ అధికారులు బలవంతంగా తొలిగించారు. కళ్యాణదుర్గం రోడ్డుకు కురుగుంట దాటిన తర్వాత రోడ్డు పక్కన తన భూమిలో కేఫ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డుకు ఎలాంటి మలుపులు లేవు. ఎదురుగా దూరంలో వచ్చే వాహనాలు కనిపిస్తాయి. స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నాయకుడి ఒత్తిళ్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి బోర్డు తీయించారు. ఊరి బయట ఉన్న తమ బోర్డే అడ్డు వచ్చిందా? అని సర్పంచ్ లక్ష్మీదేవి, ఆమె భర్త ఆదినారాయణ మండిపడ్డారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వారు గట్టిగా అడిగితే తమకు ఒత్తిళ్లు ఉన్నాయంటూ చెప్పడం విశేషం.

'రేషన్'కు ముప్పతిప్పలు

రాప్తాడు: పాత రేషన్ పంపిణీ పద్ధతి తొలిరోజే అట్టర్ ఫ్లాప్ అయిన విషయం విదితమే. రెండో రోజూ కూడా కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డీలర్లు సమయ పాలన పాటించడం లేదు. కార్డుదారులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. వృద్ధులు క్యూలో నిలబడలేక అవస్థలు పడ్డారు. తీసుకున్న రేషన్‌ను ఇంటికి చేర్చేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. ఇంటి వద్దకే రేషన్ వచ్చి ఉంటే ఈ బాధలు తప్పేవని కార్డుదారులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. నీడ, నీళ్లు కుర్చీలు అందుబాటులో ఉంచాలని అధికారులు సూచించినా.. అవేమీ డీలర్లు పట్టించుకోలేదు. కొన్ని చోట్ల తేలిక పాటి అలంకరణ చేసి షో నడిపించారు. చాలా చోట్ల నిలువ నీడలేక ఎండకు లబ్ధిదారులు అల్లాడిపోయారు. రెండో రోజూ అయినా వసతులు కల్పిస్తారని కార్డుదారులు ఆశించినా.. ఎక్కడా వసతులు కల్పించలేదు. కొన్ని చోట్ల నీళ్లు అందుబాటులో ఉంటే మరికొన్ని చోట్ల అందుబాటులో లేవు. కూర్చోవడానికి కుర్చీలు కరువయ్యాయి. ఎండకు ముందు రేషన్ తీసుకుందామని వచ్చిన పండుటాకులు షాపుల వద్ద ఇబ్బందులకు గురయ్యారు. ఇక చాలా షాపుల వద్ద డీలర్లు సమయ పాలన పాటించలేదు. వారి ఇష్టానుసారంగా షాపులు తెరిచి పంపిణీని మొదలు పెట్టారు. ఉదయం 10 గంటలు దాటినా సర్వర్ పని చేయడం లేదని మండలంలో డీలర్లు రేషన్ షాపులు తెరవలేదు. దీంతో కార్డుదారులు క్యూలో వేచి ఉండలేక ఎండతాపానికి అల్లాడిపోయారు. ఆ తర్వాత సాంకేతిక సమస్యలు చుట్టి ముట్టాయి. గతంలో రేషన్ సరుకులను ఇంటి వద్దే పంపిణీ చేసేవారు. ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు ఇచ్చిన సమాచారంతో సమయానికి ఇంటి ముందే సరుకులు పొందేవారు. పడిగాపులు కాచే పని ఉండేది కాదు. ఆదివారం నుంచి ప్రారంభమైన పాత రేషన్ పంపిణీ విధానం కార్డుదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. దూరపు ప్రాంతాల నుంచి వచ్చి రేషన్ తీసుకోవాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. ఆటోలు, ఇతర్రతా వాహనాలను ఆశ్రయించి షాపునకు సరుకులు తీసుకొచ్చేందుకు వస్తున్నారు. మళ్లీ ఇంటింటికీ రేషన్ విధానం వస్తే బాగుంటుంది.. ఈ పడిగాపులు మాకొద్దని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అనంతపురంలోని ఐదవ రోడ్డు స్టోర్ నంబరు-17 వద్ద బియ్యం కోసం పడిగాపులు



చిన్మయనగర్‌లో రేషన్ సరుకుల కోసం ఎండలోనే నిలబడిన కార్డుదారులు

తెల్లవారుజామున వచ్చాను



మొదటి రోజు బియ్యం కోసం వచ్చాను. జనాలు అధిక సంఖ్యలో ఉండడంతో ఇంటికి వెళ్లిపోయాను. ఈ రోజు బియ్యం కోసం తెల్లవారుజామున 4 గంటలకు వచ్చాను. అప్పటి నుంచి క్యూలో కూర్చున్నాను. ఉదయం 6 గంటలకు డీలర్ వచ్చి చూడగా సర్వర్ పని చేయడం లేదని చెప్పారు. ఇక్కడే కూర్చున్నాను. బియ్యం వచ్చాక ఎవరినో ఒకరిని బతిమాలాడుకుని ఇంటి దగ్గరకు వదిలి పెట్టామని అడగాలి. ఎందో ఈ పరిస్థితి నాకైతే అర్థం కావడం లేదు. వృద్ధులకు ఇంటి వద్దే సరుకులు పంపిణీ చేస్తే బాగుంటుంది.

– ఆదినారాయణ, చిన్మయనగర్

మృతుడికి నివాళి



ఓబులేసు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఓబులేసు (70) అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం ఆత్మకూరుకు విచ్చేశారు. ఓబులేసు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓబులేసు కుమారుడు రామాంజి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, ఎంపీపీ హేమలత, మాజీ ఎంపీటీసీ చిన్నక్క ,రామాంజి తదితరులు పాల్గొన్నారు.

భావితరాల రూపశిల్పి ఉపాధ్యాయుడే

- టీచర్లకు 3 రోజుల 'తర్ల్' శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజానికి ఉపయోగపడే భావితరాలను తయారు చేసే రూపశిల్పి ఉపాధ్యాయుడే అని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ) టి.శైలజ పేర్కొన్నారు. నగర శివారులోని గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు జరిగే 'తర్ల్' శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో గణితం, భాషా నైపుణ్యాల్లో సామర్థ్యం పెంచడానికి ఉపాధ్యాయులకు అవసరమైన మెలకువలు ఈ శిక్షణలో ఇస్తారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో గణితం, భాషల పట్ల ఆసక్తి సంబంధించిన ఉపాధ్యాయులు బోధించాలన్నారు. డీఆర్పీలు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఈ అంశాలపై శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారన్నారు. రాష్ట్ర పరిశీలకులు సురేష్ కుమార్, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

అనంతపురం కార్పొరేషన్: పార్టీ బలోపేతానికి సైనికుల్లా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనా రాజారత్నం, ప్రచార విభాగం నగర ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి తదితరులు సోమవారం జిల్లా అధ్యక్షుడు అనంతను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా..ఇంత వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఈనెల 4న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్టీ పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలోనూ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, నాయకులు సుధీర్ రెడ్డి, సాదిక్, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, నౌషాద్, కాశీ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని కలసిన రాజారత్నం, రంగారెడ్డి

'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం



రాప్తాడులో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న రాప్తాడులో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ విభాగం మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయపెట్టేందుకు యత్నిస్తోందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, ప్రజలు ఉదయం 9 గంటలకే రాప్తాడుకు పెద్ద ఎత్తున చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాలబావి లక్ష్మీనారాయణ, రామలింగమయ్య, చింతకాయల జయన్న, కొత్తపల్లి చిన్న కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌గౌడ్

'ర్యాలీకి తరలిరండి'

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బడుగులు అన్ని విధాల అభివృద్ధి చెందేలా జగనన్న చర్యలు తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా.. ఇంత వరకు ఎటువంటి ప్రయోజనం లేదని, ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు అలివిగాని హామీలు ఇచ్చి.. అందులో ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారన్నారు. ఈనెల 4న ఉదయం 10 గంటలకు పాతూరు చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై గాంధీ విగ్రహం, వన్‌టౌన్ పీఎస్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలే

అనంతపురం సిటీ: పద్నాలుగేళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను పనిలో పెట్టుకుంటే పడే శిక్షలు కఠినంగా ఉంటాయి. అటువంటి వారికి జైలు తప్పదని కార్మిక శాఖ సహాయ కమిషనర్ లావణ్య హెచ్చరించారు. బాల కార్మికుల గుర్తింపునకు సంబంధించి కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా అనంతపురంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, గుత్తి రోడ్డు, వేణుగోపాల్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. హోటళ్లు, టీ స్టాళ్లు, కర్మాగారాల్లో ఆ విధంగా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లు తమ దృష్టికి వస్తే ఆయా సంస్థల యాజమాన్యాలపై కార్మిక చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. తొలిసారి పట్టుబడితే రూ.20 వేలు జరిమానా, జైలు జీవితం అనుభవించాల్సి ఉంటుందన్నారు. కార్మిక శాఖ సహాయ అధికారులు ప్రతాప్ నాయుడు, రాధా రమాదేవి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ తోపుల వెంకట్‌కుమార్, మూడో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

బదిలీల్లో అసంబద్ధాలను తొలగించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో పాయింట్ల కేటాయింపు అసంబద్ధాలను తొలగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు మాట్లాడుతూ.. రిఅపోర్షన్ గురైన ఉపాధ్యాయులు పాత స్టేషన్ లో 8 సంవత్సరాలు పనిచేయక పోయినా 8 సంవత్సరాల పాయింట్లు కేటాయిస్తున్నారన్నారు. 2017 బదిలీ ఉపాధ్యాయులకు కంపల్సరీ బదిలీల కింద చూపిస్తున్నారన్నారు. కానీ పాయింట్ల కేటాయింపులు మాత్రం 8 సంవత్సరాల పాయింట్లు 24 ఇవ్వకుండా పని చేసిన కాలానికి డెసిమల్ రూపంలో పాయింట్లు ఇవ్వడంతో ఆ ఉపాధ్యాయులు బదిలీల సీనియారిటీలో వెనుకబడి ఉన్నారని వాపోయారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన గార్లదిన్నెకు చెందిన టీడీపీ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక డీసీసీబీ చాంబర్‌లో సీఈఓ కె.సురేఖారాణి, అధికారులు, పలువురు టీడీపీ నాయకులు సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ సహకారంతో అందరం కలిసిమెలసి రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి డీసీసీబీని అభివృద్ధిబాట పట్టిద్దామని తెలిపారు. అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన కనగానపల్లి మండలం టీడీపీ నాయకుడు నెట్టెం వెంకటేశులు కూడా బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ టి.విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ఇతర టీడీపీ నాయకులు సమక్షంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డీసీఎంఎస్ ద్వారా రైతులకు మంచి సేవలు అందించాలని సూచించారు.

ఇంగ్లిష్ టీచర్ల ఖాళీలు తేల్చండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతులకు ఖాళీల లెక్కలు తేల్చాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. స్థానిక శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్లు చేపడుతున్న ధర్నా సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చినా అధికారులు పదోన్నతుల గురించి పట్టించుకోలేదన్నారు. 230 పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 19 మాత్రమే ఖాళీలు ఉన్నట్లు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తమకు ఇంగ్లిష్ టీచర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీధర్ గౌడ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీకే ముత్యాలప్ప, పీఆర్టీయూ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ నాయక్, పీడీ అసోసియేషన్ నరసింహారెడ్డి, కేశవమూర్తి, అక్కులప్ప, ఆప్టా జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, శంకరమూర్తి, డీటీడబ్ల్యూఏ నాయకుడు పెద్దన్న మద్దతు తెలిపారు. ధర్నాలో బాధిత టీచర్లు సూర్యుడు, జయపాల్ నాయుడు, నాగభూషణ, జయరాం నాయక్, సురేష్, డేనియల్, విజయశ్రీ, ధనలక్ష్మి, లక్ష్మీదేవి, నరసింహులు, శివ ప్రసాద్, శేషగిరి, పీజీ లక్ష్మీనారాయణ, వన్నా రెడ్డి, బాబ్జి నాయక్, ఓబిరెడ్డి, ఆరూడప్ప, కేశవరెడ్డి, సూర్యనారాయణ, సుధాకర్, భాగ్యరాజ్, మల్లికార్జున, గంగాధర్, జిలాన్ ఖాన్, రామాంజనేయులు, మృత్యుంజయ పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సమస్యలకు పరిష్కారం చూపండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: వివిధ సమస్యలు, బాధలతో వచ్చే పిటీషనర్లు సంతృప్తి చెందేలా చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ అన్నారు. సోమవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సెల్ సిస్టం) కార్యక్రమానికి 103 వినతులు వచ్చాయి. ఫిర్యాదుదారులు అర్జీలు, వారి వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

అనంతపురం రూరల్/రాప్తాడు/రాప్తాడురూరల్/ఆత్మకూరు: ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఇచ్చిన హమీలను విస్మరించి ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరులో నిరసన చేపట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణం, నగర ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



ప్రశంసాపత్రాలను చూపుతున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: స్థానిక శంకరమఠంలో సోమవారం నగరానికి చెందిన నర్తన అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సంస్థ వారి వేసవి శిక్షణ ముగింపు వేడుకలు నిర్వహించారు. చిన్నారులు పురంధర, త్యాగయ్య, అన్నమయ్య కృతులపై శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ చిన్నారులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్న నాట్యశిక్షకులు అమూల్య హరీష్‌ను అభినందించారు. అనంతరం చిన్నారులను అభినందించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, అవోపా ఉపాధ్యక్షురాలు సంధ్య, ఇన్నర్‌వీల్ శ్వేతావర్ధన్, ఐద్వా సావిత్రి, మొదలి మురళీకృష్ణ, డాక్టర్ మల్లెల త్రివేది పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కనేకల్లు మండలం హనకనహాల్ గ్రామానికి చెందిన పందిరిపల్లి హర్షిత్‌రెడ్డి ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో 4,363 ఓపెన్ కేటగిరీ ర్యాంకు సాధించాడు. తల్లి రమాభారతి, తండ్రి పి.సూర్యప్రకాష్‌రెడ్డి ఇద్దరూ ఎస్జీటీలుగా పని చేస్తున్నారు. కుమారుడు జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించి ఐఐటీకి ఎంపిక కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మంజునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంక్షేమశాఖ సూపరిండెంట్ నాగరత్నమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, తరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం సమీపంలోని సిండికేట్ నగర్‌కు చెందిన బుద్ధి సరోజమ్మ (80) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సరోజమ్మ జీవితంపై విరక్తి పెంచుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిన ఆమె.. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను గుర్తించిన స్థానికులు జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను 108లో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అయితే తలకు బలమైన గాయాలు కావడంతో కోలుకోలేక మంగళవారం మరణించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కులగణన నిర్ణయం సరికాదు

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్రం చేపట్టబోయే కుల గణనలో భాగంగా ఈడిగ, గౌడ్‌లను కలిపి గణన చేయాలని తీసుకున్న నిర్ణయం సరికాదని ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు వాపోయారు. సోమవారం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు మేకల గోపాల్ గౌడ్, ఈడిగ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి గండ్లూరి నాగభూషణం, వెంకటేష్, నాయకులు నాగరాజు, లాలెప్ప, గోపాల్, గంగాధర్, తుమ్మల నారాయణస్వామి, సూరిబాబు, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, నక్కల రాము, ఎర్రిస్వామి, జగదీష్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలేఖపై చర్యలు తీసుకోండి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించే శ్రీలేఖపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు డీఎంఈకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం గైనిక్ విభాగంలో ఒకే రోజు ముగ్గురు పసికందులు మృతి చెందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలేఖ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్న కారణాలపై సూపరింటెండెంట్ విచారణకు ఆదేశించి డీఎంఈకి ఫిర్యాదు చేశారు.

మళ్లీ అదే సమస్య..



అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలను వెనక్కి పంపిస్తున్న సెక్యూరిటీ గార్డ్

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టరేట్‌లో కాకుండా మండలాల్లో నిర్వహించే క్రమంలో వేదిక మార్పు సమాచారం గ్రామాల్లోకి చేరడం లేదు. వేదిక మార్పు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేవలం ప్రకటనకు పరిమితం చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకునేందుకు దాదాపు 200 మంది కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అయితే పరిష్కార వేదిక ఈరోజు లేదని చెప్పడంతో ఊసూరుమంటూ వెనుతిరిగారు. ఈ విషయంపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆంజనేయులు

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డి.ఆంజనేయులు నియామకమయ్యారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనిత ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ రమేష్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రిన్సిపాల్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

'నారాయణ' విద్యార్థులకు అభినందన



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు, యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ చాటిన నగరంలోని నారాయణ కళాశాల విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు బొకేలు అందజేసి సన్మానించారు. అధ్యాపక బృందం, విద్యార్థుల పట్టుదల, శ్రమ, తల్లితండ్రుల ప్రోత్సాహంతో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి సాధ్యమైందని నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ బీకే బద్రీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్ రెడ్డి, ఓబన్న గౌడ్ పాల్గొన్నారు.

'తేజ' విద్యార్థిని ప్రతిభ

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నగరంలోని తేజా జూనియర్ కళాశాల విద్యార్థిని ఆకులేటి చందన ఆలిండియా కేటగిరీ 81 ర్యాంకు దక్కించుకుంది. విద్యార్థినిని కళాశాల డైరెక్టర్ తేజేశ్వరరెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి, డైరెక్టర్లు అనిల్‌కుమార్, సాయి చైతన్య, నేత్రా, వాణి అభినందించారు. తమ విద్యార్థిని జాతీయస్థాయి ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందని తేజేశ్వరరెడ్డి తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
మంగళవారం ॥ 3-6-2025

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?


నేడు వరల్డ్ సైకిల్ డే

మొదటి వాహనముకు వందనం!



సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఎ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చేవాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది.

అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజీ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దె కెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేప్పొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...


కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్–ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలర్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలొకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లొకేషన్‌ని ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటీఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్

జూన్ 2న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా



'ఘాటి' పోస్టర్

జూలైలో ఘాటి

హీరోయిన్ అనుష్కాశెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు మరో లీడ్ రోల్ చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమాని జూలై 11న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'ఘాటి' సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందించగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. వ్యాపార రంగంలో పైస్థాయికి వెళ్లాలనుకునే ఓ మహిళను కొందరు మోసం చేస్తారు. దీంతో ఆ మహిళ వారికి తగిన బుద్ధి చెప్పి, వ్యాపారంలో అత్యున్నత స్థాయికి ఎలా చేరుకుంటారు? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.

మనసు నీకై రథమయ్యే రారా...


కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'విశ్వద నాయక...' అంటూ సాగే నాలుగో పాటని విడుదల చేశారు. 'విశ్వద నాయక.. విహిత వీరా... మనసు నీకై.. రథమయ్యే రారా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాటలో కమల్‌హాసన్ క్యారెక్టర్ నేచర్, అభిరామి, త్రిష పాత్రల్లోని డైనమిక్స్‌ని లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్ ఈ పాటకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా జాయ్ వండర్ ఫుల్ వోకల్స్ ఎమోషన్‌ని నావిగేట్ చేయగా, ఏఆర్ అమీన్ ర్యాప్ ఎనర్జీని మరింతగా పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కుబేర ప్రేక్షకులకి నచ్చుతుంది

– నాగార్జున


నాగార్జున, ధనుష్

''చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా నాకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. 'కుబేర'ని శేఖర్‌గారు అద్భుతంగా తీశారు. ఈ చిత్రం ప్రేక్షకులకి కచ్చితంగా నచ్చుతుంది. ఈ మూవీ తర్వాత రజనీకాంత్ గారి 'కూలీ' సినిమా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి రెడీగా ఉంది'' అని హీరో నాగార్జున అక్కినేని తెలిపారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'కుబేర' ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''కుబేర' కోసం తిరుపతిలో ఎండలో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలతో బిచ్చగాడిగా నటించడం మరచిపోలేను. ఆ అనుభవం జీవితంలోని ముఖ్యమైన సత్యాలను గుర్తు చేసింది'' అన్నారు. ''కుబేర' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు రష్మికా మందన్నా. ''ధనుష్, నాగార్జునగారి నటన మెస్మరైజింగ్‌గా ఉంటుంది'' అని శేఖర్ కమ్ముల తెలిపారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.. గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కూర్ రామ్‌మోహన్ రావు, సునీల్ నారంగ్. ఈ కార్యక్రమంలో దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు జాన్వీ నారంగ్, భరత్ నారంగ్, సిమ్రాన్ నారంగ్, కెమేరామేన్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు.

దీపావళికి తెలుసు కదా


సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా, వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 17న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ''మనసును తాకేలా, ఊహించని మలుపులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నాన్న అంటేనే దైవం


పృథ్వీ అంబర్, సాయికుమార్

''నాన్న అంటేనే మొదటి దైవం.. తను పోసిన ప్రాణమిది.. నాన్న అనగానే వాలే నీ ముందు.. అలుపెరుగని ప్రాణమిది.. మన కొరకే బతికే ప్రాణం.. మన బాధ్యత ఒకటే ధ్యానం'' అంటూ సాగుతుంది 'చౌకీదార్' సినిమాలోని 'నాన్న' యాంథమ్ పాట లిరికల్ వీడియో. పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా, సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'చౌకీదార్'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో డా. కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మించారు. సచిన్ బస్రూర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంతోష్ వెంకీ సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు

– రూపేశ్


పవన్ ప్రభ, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

''షష్టిపూర్తి' అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' చిత్రం నుంచి 'షష్టిపూర్తి' వరకు ఏ నటుడికి దక్కని సినిమా ప్రయాణం నాకు దక్కింది. 'షష్టిపూర్తి' చూస్తూ ప్రేక్షకులు ఏడ్చేస్తున్నారంటేనే మేం విజయం సాధించినట్టు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్ నిర్మించిన ఈ సినిమా మే 30న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కల్చరల్ బ్లాక్‌బస్టర్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ–''విజయ, వాహినీ, ఏవీఎం వంటి గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో చెబుతున్నాను.. నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి పాత్రలు నా చివరి శ్వాస వరకు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ–''షష్టిపూర్తి'ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు'' అని తెలిపారు. ''షష్టిపూర్తి' లాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే నా లాంటి దర్శకులు, రూపేశ్ లాంటి నిర్మాతలు ఇంకా ముందుకు వస్తారు'' అన్నారు పవన్ ప్రభ. ఈ కార్యక్రమంలో కెమేరామేన్ రామ్, పాటల రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.

తెలంగాణ కళాకారులకు అన్యాయం జరిగింది

– ప్రతాని రామకృష్ణగౌడ్


అమృత్ గౌడ్, రమేశ్ నాయుడు, ప్రతాని రామకృష్ణ, కిరణ్

''తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌గారి పేరుతో అవార్డ్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే ఈ అవార్డు కమిటీ జ్యూరీకి మురళీ మోహన్, జయసుధలను చైర్మన్లుగా నియమించడం ఏంటో అర్థం కాలేదు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'దిల్' రాజు తన అధికారాలను దుర్వినియోగం చేశారు. తన వాళ్లకే అవార్డ్స్ ఇచ్చుకున్నారు. జ్యూరీ కమిటీలో ఉన్నవాళ్ల సినిమాలకు అవార్డ్స్ ఇవ్వకూడదనే నిబంధనలను పాటించ లేదు. థియేటర్స్ బంద్ విషయంలోనూ 'దిల్' రాజు ప్రమేయం ఉంది'' అని 'తెలంగాణ ఫిలిం చాంబర్' చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. జ్యూరీ కమిటీ సభ్యులు అన్ని సినిమాలు చూడలేదు. థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం వల్ల గతంలో లాభాలు ఆర్జించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రస్తుత విధానాల వల్ల నష్టాలు వస్తున్నాయి. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత నిర్మాత డి. సురేష్ బాబులాంటి కొందరు తమ స్వార్థంతో అద్దె విధానాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్.. లాంటి వాళ్లు సురేష్ బాబు బాటలోనే నడిచి థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు'' అన్నారు. ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లను ప్రభుత్వం పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అన్నారు టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, నటుడు కిరణ్, తెలంగాణ డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, తెలంగాణ రైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అమృత్ గౌడ్ కోరారు.

డేంజర్ బాయ్స్


వికాస్, రాధా

వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహళ్లి ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'అపాయవీడి హెచ్చరిక'. అభిజిత్ తీర్థహళ్లి దర్శకత్వంలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను యశ్విని క్రియేషన్స్, గీతా ఫిలిమ్స్‌పై శ్రీరంగం సతీష్ కుమార్ తెలుగులో 'డేంజర్ బాయ్స్' టైటిల్‌తో త్వరలో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్టులుక్‌ని, దర్శక–నిర్మాత సాయివెంకట్ టీజర్‌ను, నిర్మాత టి.రామసత్యనారాయణ– జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్య వర్ధన్ ఈ సినిమా పాటలను రిలీజ్ చేశారు.

తొలిప్రేమ తోపేం కాదు!


శ్రీ గౌరీప్రియ, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కలర్ ఫొటో', బేబి' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ గౌరీప్రియ హీరోయిన్. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలువుతుంది', 'తొలిప్రేమ అంత తోపేం కాదు' అంటూ కిరణ్ చెప్పే డైలాగులు గ్లింప్స్‌లో ఉన్నాయి.